సాక్షి
పెద్దపల్లి
శనివారం । 28 । అక్టోబర్ । 2023

బాలికలపై అఘాయిత్యాలు అరికట్టాలి



రామగుండం: బాలికలపై అఘాయిత్యాలు, అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని గోదావరిఖని ఒకటో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ దుర్గం గణేశ్ సూచించారు. అంతర్గాం మండలం కుందనపల్లి కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు మానసిక ధైర్యం కల్పించే కరాటే, యోగా తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యాలయ ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.శంకర్, న్యాయవాదులు ఎస్.కిషన్‌రావు, ఆరె మధు, జి.భూమయ్య, ప్రసన్న, ప్రదీప్‌కుమార్, కాదాసి శేఖర్, విక్రమ్‌సింగ్, వరలక్ష్మి, ముచ్చకుర్తి కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వికాస్‌రాజ్‌కు స్వాగతం



పూలమొక్క అందిస్తున్న అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం చేరుకున్నారు. ఆయనకు అధికారులు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి ఆయన చేరుకున్నారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ, పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ వికాస్‌రాజ్‌ను కలుసుకున్నారు. కాగా, మంచిర్యాల పర్యటన ముగించుకుని వస్తూ వికాస్‌రాజ్ ఇక్కడ రాత్రి బస చేశారు.

సన్నరకాలు సాగు చేయండి



వంగడాలు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: తెగుళ్లను తట్టుకుని, స్వల్పవ్యవధిలో చేతికొచ్చే సన్నరకం వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, కూనారం పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌సిద్ధి సూచించారు. కాసులపల్లిలోని రైతు ఎర్రంమల్లారెడ్డి సాగుచేసిన చిరుసంచుల మినీకిట్స్ దశలో వరి రకాలను శుక్రవారం వారు పరిశీలించారు. బీపీటీ- 5204 రకానికి ప్రత్యామ్నాయంగా జేజీఎల్- 33124, జేజీఎల్-28639, జేజీఎల్-27356రకాలు, కూనారం పరిశోధనాకేంద్రానికి చెందిన కేఎన్ఎం-12368, కేఎన్ఎం-7715, కేఎన్ఎం-12510, రుద్రూర్ పరిశోధనాకేంద్రానికి చెందిన ఆర్‌డీఆర్-1200, ఆర్‌డీఆర్-1162, రాజేంద్రనగర్‌కు చెందిన ఆర్ఎన్ఆర్-31479, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వరి రకాలను సాగు చేస్తున్న రైతు ఎర్రం మల్లారెడ్డిని వారు అభినందించారు. రైతులకు ఈ పంటల సాగుపై అవగాహన కల్పించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పాలకుర్తి(రామగుండం): ఆయిల్‌పామ్ సాగు చేయడం ద్వారా రైతులు మరింత ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం ఈసాలతక్కళ్లపల్లి శివారులోని శ్రీసమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ కోసం ప్రభుత్వం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సంప్రదించాలని ఆయిల్ కేమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో కేశవ్‌కల్యాణ్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి ప్రకాశ్, హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, ఏఈవోలు యోజన, సుష్మా, ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

రూ.525కోట్లు వసూలు చేసి..



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మలివిడతగా గొర్రెలు పంపిణీ చేస్తామంటూ గొల్ల, కుర్మల నుంచి డీడీల రూపంలో 1.20లక్షల మంది నుంచి రూ.525కోట్లు వసూలు చేసి, 27వేల మందికే పంపిణీ చేశారని, గొర్రెకాపరుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారం తిరుపతియాదవ్ అన్నారు. మిగతా లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందించాలని, లేదా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయాలన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 2లోగా ఈ ప్రక్రియ పూర్తిచేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు మేకల నర్సయ్య, ఎలుక రాజు, కుమార్ యాదవ్, లక్ష్మణ్, మహేందర్, సంపత్‌యాదవ్, వెంకటరమణ, రంజిత్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేసేలా..



- పటిష్ట భద్రత నడుమ ఎన్నికలు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా తనిఖీలు
- కోడ్ ఉల్లంఘనులపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు
- 'సాక్షి'తో పెద్దపల్లి డీసీపీ డాక్టర్ చేతన

సాక్షి, పెద్దపల్లి: ఓటరు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్‌శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తోందని పెద్దపల్లి డీసీపీ డాక్టర్ చేతన తెలిపారు. ప్రతీఓటరుడు స్వేచ్ఛగా ఓటు హక్కువినియోంగించుకునే వాతావరణం కల్పించేలా ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ఓటర్లను మభ్యపెట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. సీ-విజిల్ యాప్, 1950 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మైలాబత్తుల చేతన.. ఎన్నికల నియమావళి అమలు, నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు. ఆమె మాటల్లోనే..

ఎక్సైజ్‌శాఖతో సమన్వయం చేసుకుంటూ..

ఎక్సైజ్‌శాఖ సమన్వయంతో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మూసివేయించాం. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో భారీ ఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్నాం. టాస్క్‌ఫోర్స్ విభాగం విస్తృతంగా సోదాలు చేపడుతోంది.

57 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో 57 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. అక్కడ ఇప్పటికే పర్యటించి పరిస్థితి సమీక్షించాం. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అక్కడ ఓటర్లకు ప్రశాంత వాతవరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా అవగహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నాం.

జిల్లాలో 4 చెక్‌పోస్టులు..

ఎన్నికల వేళ తాయిలాల పంపిణీని అడ్డుకుంటాం. మద్యం, వస్తుసామగ్రి పంపిణీ, డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశం ఉంటుంది. వీటిని కట్టడి చేసేపనిలో నిఘా బృందాలు నిమగ్నమయ్యాయి. అక్రమ మద్యం, నగదు తరలింపు కట్టడికి జిల్లాకు నలువైపులా నాలుగు చెక్‌పోస్టులు, 16అంతర్గత టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశాం.

రూ.93.13లక్షలు స్వాధీనం..

జిల్లాలో ఇప్పటివరకు రూ.93,13,860 నగదు, 42.082 కేజీల వెండి, 29 ఆంప్లిఫ్లయర్లు, 58 డీజే బాక్స్‌లు, 58 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నాం. చెక్‌పోస్టులు, ఇతర తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్మును ట్రెజరీకి అప్పగిస్తాం. పట్టుబడిన నగదుకు సంబంధించిన పత్రాలు గ్రీవెన్స్‌సెల్‌లో చూపెడితే తిరిగి సొత్తు పొందవచ్చు. ఇప్పటివరకు ఐటీ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు.

ఫాస్ట్‌మార్చ్‌తో భరోసా

జిల్లా పోలీస్ బలగాలకు తోడుగా సీఆర్‌పీఎఫ్ బలగాలు సైతం జిల్లాకు చేరాయి. సమస్యాత్మక కేంద్రాలు, గ్రామాల్లో వారి సేవలను వినియోగించుకుంటాం. ఆయా ప్రాంతాల్లో ఫాస్ట్‌మార్చ్ చేపడతాం.

బైండోవర్లు..
లైసెన్స్‌డ్ తుపాకుల స్వాధీనం

జిల్లాలో ఇప్పటికే 736కేసులకు సంబంధించిన 3,101 మందిని బైండోవర్ చేశాం. వారికి కౌన్సెలింగ్ ఇచ్చాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. లైసెన్సు కలిగిన తుపాకులు 25 ఉండగా, వారందరి నుంచి స్వాధీనం తుపాకులు చేసుకున్నాం.

సోషల్ మీడియాపై నిఘా

వివిధ సామాజిక మాధ్యమాల్లో ఇతరులను వ్యక్తిగతంగా కించపరిచేలా, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వక పోస్టులు పెట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. బల్క్ మేసేజ్‌లపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి

ఎంబీబీఎస్ పూర్తిచేసి డాక్టర్‌గా పనిచేసిన అనంతరం సివిల్స్ వైపు దృష్టిసారించా. వైద్యం అందిస్తున్న సమయంలో ఎక్కువ మంది మహిళలు పౌష్టికాహారం లోపం, ఇతర సమస్యలతో బాధపడే వారు నా వద్దకు వచ్చేవారు. వారికి మరింతసేవ చేయాలంటే సివిల్స్ బెటర్ చాయిస్ అనుకున్నా. తొలిప్రయత్నంలో ఐఆర్ఎస్ ఎంపికై రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా నాలుగేళ్లు పనిచేశా. రెండోప్రయత్నంలో ఐపీఎస్‌గా ఎంపికయ్యా. జిల్లాలో ప్రధానంగా మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా.

ఎన్నికల వ్యయంపై నిఘా

- ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై దృష్టి
- జప్తు సమయాల్లో నిబంధనలు పాటించాలి
- 'కోడ్' ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో చేస్తున్న వ్యయంపై నిఘా పెంచి, వివరాలు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల వ్యయ నోడల్ అధికారి శ్రీమాలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి ప్రతీఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల వ్యయ నోడల్ అధికారి శ్రీమాల సూచించారు. వాహనాలు, కుర్చీలు, స్టేజీ, సౌండ్, భోజనం తదితర అంశాలను కూడా పరిశీలించి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు.

ప్రలోభాలపై నజర్..

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, నగదు, ఉచిత ప్రలోభాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీమాల సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన ఆధారాలు ఉండేలా వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. సి-విజిల్‌యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబరు, ఇతర మార్గాల ద్వారా అందే సమాచారాన్ని బట్టి ఉల్లంఘనలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన..

పంట దిగుబడులు చేతికందే సమయం ఆసన్నమైందని, వాటిని అమ్ముకుని సొమ్ము తీసుకెళ్లే రైతులు ఇబ్బందులు పడకుండా అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఈవో, పంచాయతీ కార్యదర్శుల నుంచి రసీదులు పొంది వెంట తీసుకెళ్లేలా రైతులకు అవగహన కల్పించాలని చెప్పారు. అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు, ట్రేనర్ రామ్మోహన్, సూపరింటెండెంట్ బండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ఎంపీతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం జీడీకే-2వ గనిపై ప్రజా అంకితయాత్ర నిర్వహించారు. గత ప్రభుత్వాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరిట పునరుద్ధరించారన్నారు. బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే సింగరేణి, కార్మికుల మనుగడ సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను సాకుగా చూపిన బీజేపీ.. ఎంఎండీఆర్ యాక్ట్-14ను ప్రవేశపెట్టి గనులను ప్రైవేటుపరం చేయడానికి చేపట్టిన వేలం పాటకు వ్యతిరేకంగా తాను నిరాహార దీక్ష చేశానని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఈ ప్రాంతంలో జాఫర్ జమానా మొదలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, జాహిద్ పాషా, మాదాసు రామ్మూర్తి, శేషగిరి, ఇంజపురి పులిందర్, చెరుకు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఆశీర్వదించి గెలిపించాలి..

కార్మికుని బిడ్డగా ఈసారి బరిలో ఉన్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరుకంటి చందర్ కోరారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్, విఠల్‌నగర్ ఏరియాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నాయకులు బొడ్డు రజిత, రవీందర్, చెరుకు బుచ్చిరెడ్డి, కౌశిక హరి, వడ్డెపల్లి శంకర్, తోడేటి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీ, వారంటీ అన్నీ అబద్ధాలే..

కాంగ్రెస్ గ్యారెంటీ, వారంటీలన్నీ అబద్ధాలేనని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు విమర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసిన ప్రజాఅంకిత యాత్రలో వారు మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం కేసీఆర్ దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నారన్నారు. బీఆర్ఎస్ 24గంటల పాటు కరెంట్ ఇస్తుంటే.. 3గంటలు సరిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అంటున్నారని విమర్శించారు. ప్రజల్లో నిరంతరం ఉండే ఉద్యమనేత కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికల సిరా ఎక్కడ తయారవుతుంది..?



మౌలిక సిద్ధాంతాలు ఫణంగా పెట్టి చేసుకునే రాజకీయ సర్దుబాట్లు వ్యవస్థనే విచ్ఛిన్నం చేస్తాయి.
– పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

మీకు తెలుసా?

నకిలీ ఓట్లను నిరోధించేందుకు ఎడమ చూపుడు వేలుకు పోలింగ్ బూత్‌లో నేరేడు రంగులో ఉన్న సిరా పూస్తారు. దీనిని భారత ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేస్తుంది. ఎన్నికల సమయంలో వాడే సిరాను కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తుంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ అదే కంపెనీ నుంచి సిరా పంపిణీ చేస్తారు. ఇదే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 29 దేశాలకు దీనిని ఎగుమతి చేస్తుంటారు. ఈ కంపెనీని మైసూర్ మహారాజు నాల్మడి కృష్ణరాజ వడయారు స్థాపించారు. స్వాతంత్ర్యానికి పూర్వం మైసూర్ రాజవంశం ఆధీనంలోనే ఉండేది. తరువాత కంపెనీని కర్ణాటక ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఓటర్లు పలుమార్లు ఓటు వేయకుండా, బోగస్ ఓటర్ల నియంత్రణకు కేంద్ర ఎన్నికల సంఘం చెరిగిపోని గుర్తుని వేలిపై వేయాలని నిర్ణయించింది. 1962లో చెరిగిపోని సిరాను ఉత్పత్తి చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కర్మాగారానికి అప్పగించారు. నేరేడు రంగులో ఉండే సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. మొదట్లో ఎడమ చేతి వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి ఓటర్ల ఎడమ చేతి వేలు-గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. ఈ సారి తెలంగాణ రాష్ట్రానికి రెండు లక్షల సిరా సీసలను సరఫరా చేస్తున్నారు. ఒక్కో సీసా సిరాను గరిష్టంగా 700 మందికి వేయొచ్చని అధికారులు వివరిస్తున్నారు.

శిక్షణతో ఉత్సాహం

గోదావరిఖని: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రిఫ్రెషర్ ట్రెనింగ్ మరింత ఉత్సాహం నింపుతుందని ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రిఫ్రెషర్ శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. మూడురోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఏజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, అధికారి సారంగపాణి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ సాయిరంజన్, డిస్ట్రిక్ట్ సెక్రటరీలు కె.భాస్కర్, వి.వెంకటేశ్, దేవేందర్, బుచ్చయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురి 'చేతి'కి టికెట్లు

- రెండో విడత అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్
- వెలమ, కరణం, గౌడ, దళిత నేతలకు చాన్స్
- సిరిసిల్ల, కరీంనగర్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ 45 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ రెండో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు వొడితెల ప్రణవ్‌బాబు, హుస్నాబాద్‌కు పొన్నం ప్రభాకర్, చొప్పదండికి మేడిపల్లి సత్యం, కోరుట్లకు జువ్వాడి నర్సింగరావు పేర్లు ప్రకటించింది. తొలి జాబితాలో రామగుండం, మంథని, పెద్దపల్లి, జగిత్యాల, ధర్మపురి, వేములవాడ, మానకొండూర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల నుంచి మొత్తం 85 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. హుజూరాబాద్ నుంచి టికెట్ పొందిన ప్రణవ్ ఈనెల 6న పార్టీలో చేరారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో అప్పటికే అక్కడ పనిచేస్తున్న బల్మూరి వెంకట్‌ను తప్పించి మరీ యువనేతకు అవకాశం ఇవ్వడం గమనార్హం.

రెండు స్థానాలపై సస్పెన్స్


కరీంనగర్, సిరిసిల్ల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. కరీంనగర్‌కు 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా కొత్త జైపాల్‌రెడ్డి, పురుమళ్ల శ్రీనివాస్, రోహిత్‌రావు తదితరులు టికెట్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆఖరు నిమిషంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అనుకున్నట్లుగానే కరీంనగర్ స్థానం మూడో జాబితాలోనే రానుంది. ఇక, సిరిసిల్ల టికెట్ ఎప్పటిలాగే కేకే మహేందర్‌రెడ్డికి వస్తుందనుకున్నా.. అధిష్టానం ఈ స్థానంలో ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి ఈ రెండు స్థానాలు మూడో జాబితాలోనే రానున్నాయి.



పేరు: జువ్వాడి నర్సింగరావు
పుట్టిన తేదీ: 04-04-1962
విద్యార్హతలు: ఎంబీఏ (ఓయూ)
సామాజిక వర్గం: ఓసీ (వెలమ)
స్వగ్రామం: తిమ్మాపూర్, ధర్మపురి, జగిత్యాల
అనుభవం: 2014, 2018లో ఎమ్మెల్యేగా పోటీ, ఓటమి.



పేరు: పొన్నం ప్రభాకర్
పుట్టిన తేదీ: 08-05-1967
విద్యార్హతలు: ఎంఏ ఎల్ఎల్‌బీ
సామాజికవర్గం: బీసీ (గౌడ)
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005-09 మార్క్‌ఫెడ్ చైర్మన్, 2009లో ఎంపీగా విజయం, 2004, 2014, 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.



పేరు: వొడితెల ప్రణవ్‌బాబు
పుట్టిన తేదీ: 15-08-1988
విద్యార్హతలు: ఎంఈ, యూఎస్ఏ
సామాజికవర్గం: బ్రాహ్మణ (కరణం)
స్వగ్రామం: సింగాపూర్, హుజూరాబాద్
అనుభవం: పలు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలు



పేరు: మేడిపల్లి సత్యం
పుట్టిన తేదీ: 25-08-1980
విద్యార్హతలు: ఎంఏ, పీహెచ్‌డీ
సామాజికవర్గం: ఎస్సీ(మాల)
స్వగ్రామం: కోరుట్లపేట్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల
అనుభవం: టీపీసీసీ అధికార ప్రతి నిధి, 2014, 2018 అసెంబ్లీ బరిలో పరాజయం.

ఆరునూరైనా ఇండిపెండెంట్‌గా పోటీచేస్తా

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

గోదావరిఖని: ఆరునూరైనా రామగుండం అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక శివాజీనగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ వ్యూహంలో భాగంగానే పలు పార్టీలతో చర్చించానని పేర్కొన్నారు. తాను ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందినా.. అధికార పార్టీ ద్వారానే అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అన్నారు. తనకు ఏ గుర్తు వచ్చినా బరిలో ఉంటానని ఆయన తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులే తనని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇండిపెండెంట్‌గా పోటీచేసిన అనుభవం ఉందని గుర్తుచేశారు. ప్రజల అభీష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నాయకులు పిడుగు కృష్ణ, జాలి రాజమణి, రవి, మంచికట్ల భిక్షపతి పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్



కూరగాయలు విక్రయిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రామగుండం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతానని కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గణపతి మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. వ్యాపారులను కలిశారు. చేతిగుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కూరగాయల మార్కెట్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే మార్కెట్ నిర్మించామని, కానీ బీఆర్ఎస్ పాలనలో వసతులు కరువై వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. నాయకులు తిప్పారపు శ్రీనివాస్, మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, పెద్దెల్లి ప్రకాశ్, యుగేందర్, ముస్తాఫా, సతీశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులవుతున్నారు..

- మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు



కండువా కప్పుతున్న మధు

మంథని: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రజలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మైదుపల్లి మాజీ సర్పంచ్ వేల్పుల పోచం శుక్రవారం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే నియోజకవర్గంలోని రామగిరి మండలం నవాబ్‌పేట, ఆదివారంపేట, ముస్త్యాల గ్రామాలకు చెందిన సుమారు 100 మంది యువకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పుట్ట మధు సమక్షంలో వారు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఆలోచనతో ఓటేయండి

రామగిరి: కాంగ్రెస్ నాయకులు నోట్ల సంచులతో వచ్చి ఆగమాగం చేస్తారని, ఓటర్లు ఆలోచనతో ఓటువేయాలని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. సెంటనరీకాలనీ సాయి రాంగార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మధు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లం పద్మ, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ మ్యాదరబోయిన కుమార్, టీబీజీకేఎస్ ఆర్జీ-3 డివిజన్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, నాయకులు ఎల్లె రామమూర్తి, బూరుగు రాజుగౌడ్, ఈసంపల్లి రమేశ్, బేతు కుమార్, బంకు మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ అధికారికి సన్మానం



ఎస్కే దాసును సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మైనింగ్)గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఎస్కే దాసును శుక్రవారం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం అధికారులతో జీఎం కార్యాలయంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఏజీఎం ఎం.శ్రీనివాస్, ఎస్వోటూజీఎం తిరుపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆచితూచి ఓటెయ్యాలి



గోనె ప్రకాశ్‌రావు

గోదావరిఖని: రామగుండం అభివృద్ధి కోసం ప్రజలు ఆచితూచి ఓటెయ్యాలని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు కోరారు. శుక్రవారం స్థానిక సాయిలీలా రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికుడిగా ఈప్రాంత అభివృద్ధి కోసం మాట్లాడుతున్నాని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 50సీట్లు గెలుపొంది మిగతా పార్టీల సహకారంతో మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేంద్రంలో బీజేపీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. రామగుండంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపిస్తే ఈప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేటీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు.

సైనికుల్లా పనిచేయాలి



మోహన్ జోషి

మంథని: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా బూత్ లెవల్ ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలని ఏఐసీసీ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ మోహన్ జోషి కోరారు. స్థానిక శివకిరణ్ గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి ఏజెంట్ల శిక్షణ తరగతుల్లో ఆయన ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామగుండంలో ఎంతమందికి ఉపాధి కల్పించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్‌లో రూ.350కోట్లతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చందర్ చెబుతున్నారని, అదెక్కడ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీప్రకారం ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ టవర్ ఏమైందని ప్రశ్నించారు. ఈప్రాంతం బొందల గడ్డగా మారుతుందని తెలిసి జీడీకే-5 ఓసీపీ ఎందుకు ఆగలేదని నిలదీశారు. నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేశ్, సింహాచలం, రమేశ్, సత్యనారాయణ, సతీశ్, శివ, యాకుబ్, అడెపు రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గడ్డ.. విలక్షణ తీర్పు

జగిత్యాల రాజకీయం.. ప్రత్యేకం

- తొమ్మిదిసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ గెలుపు
- ఎన్టీఆర్, వైఎస్సార్‌ల కేబినెట్‌లో మంత్రిగా జీవన్‌రెడ్డి
- చంద్రబాబు హయాంలో మంత్రిగా రమణకు అవకాశం
- గత ఎన్నికల్లో పాగా వేసిన టీఆర్‌ఎస్

జంగ్ తెలంగాణ



జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. చారిత్రకంగా, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత డివిజన్ కేంద్రం కాస్త 2016లో జిల్లా కేంద్రంగా మారడంతో జగిత్యాల రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ సుమారు రూ.26 కోట్లతో సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మించారు. ఎస్పీ కార్యాలయం, వైద్య, నర్సింగ్, వ్యవసాయ కళాశాలలు, మాతాశిశు సంరక్షణ, డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 50 బెడ్లతో క్రిటికల్ కేర్ యూనిట్, న్యాక్ సెంటర్ ఏర్పాటయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి 330 బెడ్స్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. జగిత్యాల మున్సిపాలిటీతోపాటు, జగిత్యాల అర్బన్, రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలున్నాయి.

ఉమ్మడి జిల్లాలోనే గుర్తింపు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీయే ఎక్కువగా తొమ్మిదిసార్లు విజయం సాధించింది. 1982లో ఎన్టీ రామారావు టీడీపీని ప్రారంభించగా ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆ పార్టీ తరఫున పోటీ చేసి, గెలిచారు. కానీ, ఎన్టీఆర్ ప్రభుత్వం కూలిపోవడంతో 1985లో బై ఎలక్షన్ వచ్చింది. అప్పుడు తెలుగుదేశం తరఫున ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేశంగౌడ్ గెలుపొందారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి, 1989లో విజయం సాధించారు.

జీవన్ రెడ్డికి గెలుపునకు బ్రేక్ వేసిన రమణ

జీవన్‌రెడ్డి గెలుపునకు ఎల్.రమణ బ్రేక్ వేశారు. 1994లో అనూహ్యంగా తెలుగుదేశం టికెట్ దక్కడంతో జీవన్‌రెడ్డిని ఓడించారు. దీంతో రమణకు చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రి పదవి సైతం దక్కింది. కానీ, సంవత్సరానికే ఎంపీ ఎన్నికలు రావడంతో కరీంనగర్ నుంచి పోటీ చేసి, చొక్కారావును ఓడించి జాయింట్ కిల్లర్‌గా పేరు గాంచారు. 1996లో జరిగిన బై ఎలక్షన్‌లో జీవన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందారు. విచిత్రం ఏమిటంటే ప్రభుత్వం టీడీపీ ఉంటే జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే మరో పార్టీకి చెందిన వారు ఉండేవారు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఉంటే ఎమ్మెల్యేగా ఎల్.రమణ, టీడీపీ గవర్నమెంట్ ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డి కొనసాగారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ సంజయ్ కుమార్ పోటీ చేసినప్పటికీ జీవన్‌రెడ్డినే ప్రజలు గెలిపించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా 60 వేల మెజారిటీతో డాక్టర్ సంజయ్‌కుమార్ గెలుపొందారు.

ఎన్టీఆర్, వైఎస్సార్ మంత్రివర్గాల్లో చోటు

జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత జీవన్‌రెడ్డికే దక్కింది. అలాగే మొదటిసారి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా, అనంతరం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా అవకాశాలు దక్కాయి. అలాగే, టీడీపీ నుంచి మొదటిసారి గెలిచిన ఎల్.రమణ చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో చేనేత, జౌళిశాఖ మంత్రిగా, ఖాదీబోర్డు చైర్మన్‌గానూ పని చేశారు. మొదటిసారి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సంజయ్‌కుమార్ ఓటమిపాలవగా, రెండోసారి అత్యధిక మెజారిటీతో జీవన్‌రెడ్డిపై గెలుపొందారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపుపై ధీమాగా ఉండి, ప్రచారంలో దూసుకుపోతున్నారు.

పలు హామీలు పెండింగ్

- జగిత్యాల నియోజకవర్గం వ్యవసాయాధారిత ప్రాంతం. రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తుంటారు. ఎస్సారెస్పీ ప్రధాన నీటి వనరు. ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని నాయకులు చెబుతున్నా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. అలాగే, జగిత్యాలలో యావర్ రోడ్ విస్తరణ పెండింగ్ ఉంది. ఇటీవలే ప్రభుత్వం అనుమతించడంతో కదలిక వచ్చి, మార్కింగ్ చేశారు. నియోజకవర్గంలో మామిడి ఉత్పత్తి కూడా ఎక్కువే. మామిడి మార్కెట్ సైతం ఉంది. ఇక్కడి నుంచి విదేశాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తున్నారు. ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేస్తే మామిడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నాయకులు ఏటా హామీ ఇస్తున్నా అమలులో సాధ్యం కావడం లేదు. రాయికల్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఇక్కడ డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే, సారంగాపూర్‌లో రూ.135 కోట్లతో రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తయింది.

నియోజకవర్గ ఓటర్ల వివరాలు

పురుషులు:	1,09,300
మహిళలు:	1,17,315
ట్రాన్స్‌జెండర్లు :	20
మొత్తం :	2,26,635

బొగ్గు బాయి

చిన్న నిర్లక్ష్యమే.. పెద్ద ప్రమాదానికి కారణం

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: పనిస్థలాల్లో చిన్ననిర్లక్ష్యమే పెద్దప్రమాదానికి దారితీస్తుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. 54వ రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జీడీకే–5 ఓసీపీపై ఏర్పాటు చేసిన రక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణపై అవగాహనతో ముందుకు సాగుతూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈసందర్భంగా రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అనంతరం రక్షణ కమిటీ సభ్యులు క్వారీ పనిస్థలాల వద్దకు వెళ్లి రక్షణ చర్యలపై ఆరా తీశారు. రక్షణ కమిగా కన్వీనర్ హెచ్ఆర్డీ జీఎం వెంకటేశ్వర్‌రావు, కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య, ఏరియా ఇంజినీరు రాంమూర్తి, సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, కాలరీ మేనేజర్ రాందాస్, అనిల్‌గబాలే తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టీబీజీకేఎస్ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం డివిజన్–2 ఏరియాకు చెందిన టీబీజీకేఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. స్థానిక దుర్గానగర్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు బాబు, మొహన్‌రావు, పైడిపల్లి ప్రభాకర్, భీముని సత్యనారాయణతోపాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ కాకుండా కాంగ్రెస్ చూసుకుంటుందని అన్నారు. చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు శంకర్‌నాయక్, కొత్త సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పేరు నిలబెట్టాలి



బహుమతులు అందిస్తున్న శ్రీనివాస్

రామగిరి: క్రీడాకారులు పోటీల్లో రాణించి కోల్‌ఇండియా స్థాయిలో సింగరేణి పేరు నిలబెట్టాలని ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ సూచించారు. సెంటనరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగాణంలో వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన కంపెనీ స్థాయివాలీబాల్ పోటీల్లో విజేతలకు ఆయన శుక్రవారం బహుమతులు అందజేశారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక కల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఎస్వోటూ జీఎం భైద్య, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీవైపీఎం శ్రీహరి, గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్ష శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో ఆపరేషన్ డైరెక్టర్ పర్యటన

ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2, ఏపీఏ గనిలో ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ పర్యటించారు. ఏపీఏ గనిలో భూగర్భ యంత్రాల పనితీరుపై ఆరా తీశారు. ఓసీపీ–2 వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ ఏలీషా, ఎస్వోటూ జీఎం భైద్య, ప్రాజెక్టు అధికారులు కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, ఇంజినీర్లు రఘురాం, నాగరాజు, ఎస్వోఎంలు జనార్దన్, రామరావు పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ 1950కి ఫిర్యాదుల వెల్లువ

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.93,13,860 నగదు జప్తుచేసి.. ఆధారాలను చూపిన వారికి రూ.88,50,850 ఇరిగి ఇచ్చేచేశామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. వాటితో పాటు 42.082కిలోల వెండి, 29 యాంప్లిఫ్లయర్లు, 58డీజే బాక్సులు, 58 గ్రాముల బంగారం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీజ్‌చేసిన వాటికి తగిన ఆధారాలు చూపి రిలీజ్ చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, సెల్ 91828 62887 నంబరులో సంప్రదించాలని కోరారు. ఇప్పటివరకు సీజ్‌చేసిన వాటిలో 30 డీజే బాక్సులు, రూ.4,63,000కు ఆధారాలు చూపలేదన్నారు. ఇప్పటివరకు సివిల్ యాప్ ద్వారా 49 ఫిర్యాదులు, 1950 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా 719 ఫిర్యాదులు అందగా పరిష్కరించామని కలెక్టర్, ఎన్నికల అధికారి వివరించారు.

ముస్తాబవుతున్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం ముస్తాబవుతోంది. స్థానిక ప్రగతినగర్‌లో(అయ్యప్పటెంపుల్ వెనకవైపు) రూ.కోటి వ్యయంతో నిర్మించిన భవనాన్ని మంత్రి కేటీఆర్ ఈనెల 1న ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం వద్ద జరిగిన బహిరంగసభ ప్రాంగణంలో ప్రారంభించారు. భవనం ఎప్పుడో పూర్తికావాల్సి ఉన్నా.. స్థలం నిర్ధారణలో జాప్యం జరిగింది. పట్టణవాసులకు అందుబాటులో ఉంటుందనే ఆలోచనతో వ్యవసాయశాఖ గిడ్డంగిని కూల్చి అక్కడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించారు. పనులు దాదాపు చివరిదశకు చేరారు. జీ ప్లస్ వన్ అంతస్తు, అన్నివసతులతో భవనం నిర్మిస్తున్నారు. మొదటి అతస్తులో ఎమ్మెల్యే నివాసం ఉండేందుకు వీలుగా పనులు చేస్తున్నారు.

పొట్టకూటి కోసం..



గాంధీ వేషధారణలో రాజమల్లయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గోదావరిఖనికి చెందిన రాజమల్లయ్య అనేవ్యక్తి గాంధీ వేషధారణతో ఆకట్టుకున్నాడు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ శుక్రవారం ఇలా కనిపించాడు. పొట్టకూటి కోసం ఇలా గాంధీ వేషధారణతో తిరుగుతున్నట్లు రాజమల్లయ్య తెలిపాడు.

ఆర్టీసీకి దసరా ధమాకా

- కలిసొచ్చిన బతుకమ్మ, దసరా పండుగలు
- 15 రోజుల్లో రూ.22.06 కోట్ల ఆదాయం
- కరీంనగర్ రీజియన్‌లో గోదావరిఖని డిపోది మొదటిస్థానం



బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు(ఫైల్)

కరీంనగర్: ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. బతుకమ్మ, దసరా పండుగలు కలిసొచ్చాయి. ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపగా గతంలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల్లోనే రూ.22.06 కోట్ల ఆదాయం వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో గోదావరిఖని బస్సు డిపో 3.27 కోట్లతో మొదటి స్థానం, జగిత్యాల డిపో 3.2 కోట్లతో రెండో స్థానం, కరీంనగర్–1 డిపో 3.1 కోట్లతో మూడో స్థానంలో, హుస్నాబాద్ డిపో 1.11 కోట్లతో చివరి స్థానంలో నిలిచాయి.

11 డిపోలు..

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోలు కరీంనగర్–1, 2, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల, మంథని, గోదావరిఖని, కోరుట్ల, హుజూరాబాద్, మెట్‌పల్లి, హుస్నాబాద్ ఉన్నాయి. వీటి నుంచి కరీంనగర్ మీదుగా హైదరాబాద్ జేబీఎస్, ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను 50.47 లక్షల కిలోమీటర్లు తిప్పారు. పండుగల సందర్భంగా ప్రత్యేక చార్జీలు వసూలు చేయబోమని అధికారులు ముందుగానే ప్రకటించారు. దీంతో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించారు. పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. దీంతో ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి అవసరాల కోసం దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లకు రావడం ఆర్టీసీకి లాభాలు తీసుకువచ్చింది. మరోవైపు డీజిల్, పెట్రోల్ ధరలు మండిపోతుండటంతో ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయించారు. రద్దీకి అనుగుణంగా ఆయా మార్గాల్లో బస్సులు సమయానికి నడపడంతో ఇబ్బందులు కలగలేదు. కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో మకాం వేసి, బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు.

సంతోషంగా ఉంది



బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులతో ఆర్టీసీకి అధిక ఆదాయం రావడం సంతోషంగా ఉంది. సంస్థకు పూర్వవైభవం తీసుకురావడానికి అన్ని వర్గాల ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరాం. ఇందుకు వారు కూడా సహకరించారు.

– ఎస్.సుచరిత, ఆర్టీసీ ఆర్ఎం

ఈనెల 12 నుంచి 26 వరకు రీజియన్ పరిధిలో వచ్చిన ఆదాయం

డిపో	తిప్పిన కి.మీ.(లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)	డిపో	తిప్పిన కి.మీ.(లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
గోదావరిఖని	7.34	327.49	జగిత్యాల	7.16	302.56
హుస్నాబాద్	2.67	111.96	కోరుట్ల	3.71	159.76
హుజూరాబాద్	3.22	150.25	మెట్‌పల్లి	3.16	132.84
కరీంనగర్–1	6.39	301.18	సిరిసిల్ల	3.49	150.99
కరీంనగర్–2	6.16	267.13	వేములవాడ	3.99	166.19
మంథని	3.19	136.28	రీజియన్ మొత్తం	50.47	2206.64

పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఈద శంకర్‌రెడ్డి

మంథని: గత ప్రభుత్వాలు, బీఆర్‌ఎస్ సర్కార్ పాలన మధ్య తేడా గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి కోరారు. పట్టణంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో దేశం గర్వించేలా ఉందన్నారు. రాష్ట్రంలో రాబోయేది మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. మంథనిలో పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. తమది మహాత్మాగాంధీ పార్టీ అని, గాంధీవారసులమని చెప్పుకునే కాంగ్రెస్‌ను స్వాతంత్ర్య వచ్చిన తర్వాత భూ స్థాపితం చేయకపోతే దేశం సర్వనాశనం అవుతుందని ఆనాడే మహాత్మాగాంధీ చెప్పారని, ఆపార్టీని భూస్థాపితం చేసేవరకూ ప్రతిఒక్కరు కంకణబద్ధులై పనిచేయాలని బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన చరిత్ర తనకే దక్కుతుందన్నారు. ఒక బీసీ బిడ్డగా ఈ స్థాయికి ఎదిగితే అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తూ రాజకీయ సమాధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను గడపగడపకూ తీసుకు వెళ్లే బాధ్యత ప్రతీఒక్కరు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ర్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లకు మరింత భద్రత

- కేంద్ర బలగాల్లో పెరిగిన మహిళా పోలీసుల సంఖ్య
- ప్రశాంత పోలింగ్‌పై అధికారుల ప్రత్యేక దృష్టి

నియోజకవర్గాల సమాచారం

సెగ్మెంట్	పోలింగ్ కేంద్రాలు	మహిళా ఓటర్లు
పెద్దపల్లి	290	1,25,555
రామగుండం	259	1,06,716
మంథని	288	1,16,458
మొత్తం	837	3,48,729



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు బలగాలు(ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెరిగిన మహిళా ఓటర్లకు అనుగుణంగా, వారికి భద్రత కల్పించడం, ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించడం కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాకు కేటాయించిన కేంద్ర పోలీసు బలగాల్లోనూ మహిళా బలగాల సంఖ్య పెంచింది.

మూడు నియోజకవరాలు..

3.48లక్షల మంది మహిళా ఓటర్లు..

- జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 30న పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడంపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.
- జిల్లాలో 6,94,612 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 3,48,729 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.(ఈనెలాఖరు వరకు పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. దీంతో వారిసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది).
- ఈసారి మహిళా ఓటర్ల రక్షణ కోసం ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మహిళా పోలీసు బలగాలను పెంచినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.
- మూడు నియోజకవర్గాల్లో 837 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాయి.
- అందులో పెద్దపల్లి సెగ్మెంట్‌లో 290, రామగుండంలో 259, మంథనిలో 288 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి.
- ఇందులో 57 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు.

మహిళా ఓటర్ల భద్రత ముఖ్యం

శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు పోలీసు సిబ్బందితో పాటు కేంద్రబలగాలు చేరుకున్నాయి. ఈసారి మహిళా పోలీసు సిబ్బందే కాకుండా కేంద్రబలగాల్లోనూ మహిళా అధికారులు, సిబ్బంది జిల్లాకు చేరారు. అవసరాన్ని బట్టి మరికొంత మంది వస్తారు.

– చేతన, డీసీపీ, పెద్దపల్లి

చేరుకున్న సాయుధ బలగాలు..

ఎన్నికల భద్రత కోసం కేంద్ర పారామిలటరీ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బలగాలు పహారా కాస్తాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, పారామిలటరీ బలగాలతో కవాతులు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

జగన్మాత.. నమోస్తుతే..

- ఆండాళమ్మ అమ్మవారికి ఒడిబియ్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన పద్మశాలీ కులస్తులు



ఆండాళమ్మకు ఒడిబియ్యం తీసుకొస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత ఆండాళమ్మను సుహాసినులు భక్తిప్రపత్తులతో కొలిచారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ ఇంటి ఆడపడుచుగా భావించే పద్మావతి అమ్మవారు, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్లకు సిరిసిల్ల పద్మశాలీ సమాజం పట్టువస్త్రాలు సమర్పించారు. మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆండాళమ్మకు ఒడిబియ్యం సమర్పించారు. అంతకుముందు శ్రీవారు మాడవీధుల్లో ఏనుగు వాహనంపై విహరించారు. గోవింద నామస్మరణలతో ఆలయ వీధులు మార్మోగాయి. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, అర్చకస్వాములు కృష్ణమాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, యూత్ విభాగం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, పత్తిపాక పద్మ, ప్రముఖులు జిందం చక్రపాణి, గుజ్జె తార, బొల్లి రామ్మోహన్, ఆడెపు రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

పొన్నరథంపై గోవిందుడు

శుక్రవారం రాత్రి ప్రధాన ఘట్టం పొన్నరథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలను కళాకారులు ఆలపించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, భజన సంకీర్తనలు చేశారు. మహిళలు మంగళహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు.



ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ
- భర్త మరణంతో ఒంటరిగా మారిన షాహిదా
- వైద్యమందక తిప్పలు పడుతున్న వైనం



మంచానికి పరిమితమైన షాహిదా బేగం

ఎల్లారెడ్డిపేట: దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడింది. కట్టుకున్న భర్త మానసిక స్థితి బాగా లేక కిరోసిన్ పోసుకొని మరణించగా.. ఒంటరి జీవితం అనుభవిస్తున్న ఆ వివాహితకు మరోసారి విధి పరీక్ష పెట్టింది. రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. 12 పక్కటెముకలు విరిగాయి. వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. ఎవరైనా దాతలు కరుణిస్తేనే వైద్యమందే పరిస్థితులున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన షేక్ షాహిదా బేగం(45)కు కామారెడ్డి జిల్లాకు చెందిన షాదుల్‌తో 18ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు షేక్ ఆసిఫ్ జన్మించాడు. అనంతరం షాదుల్ మానసిక పరిస్థితి సరిగా లేక ఐదేళ్ల క్రితం నిప్పంటించుకొని మృతిచెందాడు. అప్పటి నుంచి కుమారుడితో కలిసి రాచర్లగొల్లపల్లిలో కిరాయి ఇంట్లో ఉండి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి గొల్లపల్లి బస్టాండ్‌లో రోడ్డు దాటుతుండగా.. బైక్ అతివేగంగా వచ్చి షాహిదాను ఢీకొట్టింది. గాయపడ్డ షాహిదాను ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు సీటీ స్కానింగ్ చేసి 12 పక్కటెముకలు విరిగినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఖర్చు చేయగా.. పూర్తిగా కోలుకోవడానికి మరో రూ.2.50లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. భర్త మరణం, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఆరేళ్ల కుమారుడితో ఉన్న ఆమె ప్రస్తుతం వైద్యం చేయించుకునే పరిస్థితుల్లో లేదు. దాతలు కరుణించి సాయం అందిస్తే తప్ప మరో అవకాశం లేదని, దాతలు ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

సాయం చేయాల్సిన ఫోన్‌పే నంబర్
99489 85093

ప్రజాగర్జన బహిరంగసభకు తరలిరండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గజ్జెల కాంతం

కరీంనగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతను కోరుతూ నవంబర్ 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభకు బహుజనులంతా తరలిరావాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం అంబేడ్కర్ స్టేడియంను సందర్శించి సభ ఏర్పాట్లపై మాట్లాడారు. దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా దగా చేస్తున్న పాలక పార్టీల తీరుపై బహుజనులంతా మేల్కొవాల్సిన అవసరం ఉందని అన్నారు. జనాభాలో సగభాగమైన బీసీలను ప్రభుత్వాలు ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మనువాద ఎజెండాను అమలు చేస్తూ రిజర్వేషన్లను దశలవారీగా ఎత్తివేసే కుట్రలను ఎదుర్కొనేందుకు బహుజనులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా, కుల సంఘాల నాయకులు సముద్రాల అజయ్, జీఎస్ ఆనంద్, కలర్ సత్తెన్న, గోష్కి శంకర్, మీసాల సాయిలు, అయిల్ల ప్రసన్న, సంజీవ్‌నాయక్, రవీందర్‌నాయక్, క్యాదాసి ప్రభాకర్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేద్దాం

- జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేసేందుకు అందరూ సన్నద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. పెద్దపల్లి మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్‌సన్నీ, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ ఐల రమేశ్ శుక్రవారం బీఎస్పీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉషతో కలిసి ఆయన వారికి బీఎస్పీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. బహుజనులు ఏకమై వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను అంతం చేయాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. కౌన్సిలర్‌గా ఉన్న తనవార్డులో అభివృద్ధి పనులకు సహకరించకుండా ఇబ్బందులకు గురిచేశారని కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకంచేసి బీఎస్పీని గెలిపించుకుందామని ఆమె అన్నారు.

ఎన్టీపీసీలో వేడుకలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థలోని 200 మెగావాట్ల మొదటి యూనిట్ ఉత్పత్తి దశలోకి వచ్చి 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం వేడుకలను జరుపుకున్నారు. ప్లాంట్‌లోని టర్బయిన్ జనరేటర్‌హాల్‌లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడారు. పనిస్థలాల్లో రక్షణ చర్యలు పాటించి మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించాలని వారు సూచించారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓటుతో బుద్ధిచెబుతాం

- గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్



ఖతర్‌లో నిర్వహించిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో రవిగౌడ్ తదితరులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ వెళ్లిన కార్మికుల కుటుంబాల ఓట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెబుతామని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ హెచ్చరించారు. ఖతర్ దేశంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దాదాపు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికుల వెతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పరాయిదేశంలో కార్మికులు అనారోగ్య సమస్యలు, పని ఒత్తిడి, రోడ్డు ప్రమాదాలు, వేతన బాధలతో ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించడంతోపాటు సంక్షేమ పథకాలల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీకి గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబసభ్యులు సిద్ధంగా ఉన్నారని, వారితో సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డిలో భారీ సంఖ్యలో నామినేషన్లు వేయించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. దీంతోపాటు సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, నిర్మల్ వంటి గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గాల్లో కూడా పోటీచేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. గల్ఫ్‌దేశాల్లోని కార్మికులందరూ గల్ఫ్ కార్మిక నాయకులకు ఓట్లు వేయించాలని కోరారు. తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు చెన్నమనేని తిరుపతియాదవ్, తెలంగాణ గల్ఫ్ అధ్యక్షుడు మధు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్, ఖతర్ జాగృతి అధ్యక్షురాలు నందిని, బీఆర్‌ఎస్ ఖతర్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, దోహా తెలుగు సమితి అధ్యక్షుడు పంచతి ధర్మరాజ్‌యాదవ్, సుందరగిరి శంకర్‌గౌడ్, తాల్లపెల్లి ఎల్లయ్య, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతికి చోటు



తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో ప్రీతి

కరీంనగర్ సిటీ: తన చుట్టూ నిత్యం చూస్తున్న ప్రకృతి, జీవరాశులనే తన కలంతో రాస్తూ అద్భుతమైన కవితలు రాస్తున్న కరీంనగర్‌కు చెందిన ప్రీతి తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయింది. ఈమేరకు ఈనెల 26న అవార్డు అందుకున్నారు. గతంలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నోబల్ అవార్డుకు ఎంపికైంది. చిన్నప్పటి నుంచి తాను చూస్తున్న ప్రకృతి, జీవరాశులు, ప్రజలు, జీవన విధానాలను నిశితంగా పరిశీలించి పాఠశాలస్థాయి నుంచే కవితలు రాయడం మొదలు పెట్టింది. ఇండియాతో పాటు మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ కాపీరైట్స్ సంపాదించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బుక్‌తో పాటు విత్తనాలు పంపి మొక్కలు పెంచేలా ప్రోత్సహించినందుకు తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతి పేరు నమోదు చేసుకుంది.

డెంగీ జ్వరంతో ఆర్‌ఎంపీ మృతి



ఆస్పత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- మృతదేహంతో బంధువుల ఆందోళన



దానపల్లి రాజమౌళి(ఫైల్)

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ దానపల్లి రాజమౌళి(38) డెంగీ జ్వరానికి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వైద్యులు సరైన వైద్యం అందించకపోవడం వల్లే మృతిచెందాడని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమౌళికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో మంచిర్యాలలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ప్లేట్‌లెట్‌లు 87వేలు ఉన్నాయని నాలుగు రోజులు చికిత్స అందించారని, గురువారం అర్ధరాత్రి ప్లేట్‌లెట్లు 11వేలకు తగ్గాయని, కరీంనగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు బంధువులు తెలిపారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని అన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి వైద్యులు కారణమని మృతుడి భార్య సుజాత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. పట్టణ సీఐ రాజు ఆస్పత్రికి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. యాజమాన్యం హామీ మేరకు బాధితులు ఆందోళన విరమించారు. కాగా, రాజమౌళికి ఇద్దరు పిల్లలు సాయిమహేష్, రోహిత ఉన్నారు.

మన ఓటర్లు ఎందరు..?

- లెక్కలు తీస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్‌ఎస్ పార్టీ తమ ఓటు బ్యాంకు ఎంత అనే లెక్కలు వేసుకుంటోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులతోపాటు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో మేలు జరిగిన వారు, సర్కారు పథకాలు అందుకున్న వారి వివరాలు సేకరిస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఎంతమంది తమ ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ప్రతిపక్షాలకు చెందిన వారు ఉన్నారనే వివరాలను వివిధ మార్గాల్లో సేకరిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ మేరకు ఓటరు ఫోను నంబరు, ఆధార్ కార్డు వివరాలు తీసుకుని నమోదు చేస్తున్నారు. నియోజకవర్గాల్లో తమ అనుకునే ఓటర్లు ఎందరు? కాని వారు ఎందరు? వచ్చే ఎన్నికల్లో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉంది? అనే కోణంలో బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాక ప్రతిపక్ష పార్టీ వైపు ఎంతమంది ఓటర్లు ఉన్నారనేది కూడా ఓ అంచనా వస్తే, ఎక్కడ పార్టీ బలంగా ఉందో, ఎక్కడ బలహీనంగా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రేషన్ డీలర్ల నుంచి..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరు ఎటువైపు ఉన్నారనే సమాచారాన్ని రేషన్ డీలర్ల నుంచి సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. చెన్నూరు నియోజకవర్గంలో రేషన్ డీలర్ల నుంచి ఓటర్ల సమాచారం ఇవ్వాలని నాయకులు కోరుతున్నట్లు అక్కడి మండలాల్లోని డీలర్లే చెబుతున్నారు. స్థానిక నాయకులు ఒక్కో చౌక ధర దుకాణం పరిధిలో ఉన్న రేషన్‌కార్డు ఉన్న వారి ఓటరు జాబితా ప్రకారం పేర్లు, ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. కొందరు డీలర్లు తాము అలా వ్యక్తిగత వివరాలు రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసం తీసుకోబోమని చెబుతున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులకు చెప్పి చేయిస్తామని కొందరు నాయకులు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సంప్రదించగా తమ ఆఫీసు నుంచి అలాంటి సమాచార సేకరణ చేయమని చెప్పలేదని చెబుతున్నారు.

రక్షణలో భాగస్వాములు కావాలి



షీల్డ్ అందుకుంటున్న అధికారులు, నాయకులు

కాసిపేట: సింగరేణి ఉద్యోగులు రక్షణలో భాగస్వాములు కావాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ జీ నాగేశ్వరరావు, అధికారి జయంత్‌కుమార్ సూచించారు. 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని సేఫ్టీ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సంవత్సరం సంస్థలో రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు కృషి చేసిన కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను అభినందించారు. రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతికతతో చేసిన పరికరాలు, పనిముట్లు వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియా వారు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో నాటకాన్ని ప్రదర్శించారు. గనిలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ఇచ్చారు. రెస్క్యూ బృందం సభ్యులు ప్రమాదం జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 53వ వార్షిక రక్షణ వారోత్సవాల్లో గెలుపొందినవారికి అధికారులు, యూనియన్ నాయకులు బహుమతి అందించారు. అంతకుముందు సేఫ్టీ బృందానికి ర్యాలీగా స్వాగతం పలికి డప్పుచప్పుళ్లతో వేదిక వద్దకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్, సంక్షేమాధికారి జీశాన్, రక్షణ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిపై..

శ్రీరాంపూర్: ఆర్కే 7 గనిపై శుక్రవారం 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా ఆధ్వర్యంలో రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదు కావడం అభినందనీయమని తెలిపారు. సేఫ్టీ జీఎం మాట్లాడుతూ.. కార్మికులకు రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అనంతరం కళాకారులు రక్షణ ప్రాముఖ్యతను తెలిపే నాటికలు ప్రదర్శించారు. తనిఖీ బృందం కన్వీనర్ డీ లలిత్‌కుమార్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, గ్రూప్ ఇంజినీర్ రాజారవిచరణ్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వరరావు, సంక్షేమాధికారి శంతన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.వందకు చేరిన ఉల్లి

- కొన్నా.. కోసినా కన్నీళ్లే..



రవీంద్రనగర్‌లో ఉల్లి విక్రయిస్తున్న వ్యాపారి

చింతలమానెపల్లి: మొన్నటివరకు సామాన్యులకు టమాట అందకుండా పోగా.. నేడు ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. స్థానిక రవీంద్రనగర్ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.వంద ఉండగా వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వారం క్రితం వరకు రూ.30 ఉన్న ధర అమాంతం పెరిగింది. ఎరుపు ఉల్లి రూ.80, తెల్ల ఉల్లి రూ.100కు విక్రయిస్తున్నట్లు చిరువ్యాపారులు తెలిపారు. స్థానికంగా ఉల్లిగడ్డ లభించకపోవడంతో పాటు టోకు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతోనే ఉల్లికి ధర పెరిగినట్లు పేర్కొన్నారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

- తల్లి ప్రేమకు దూరమైన ఇద్దరు చిన్నారులు



పుష్పలత(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుటుంబ సభ్యులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ఓ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి వివాహిత ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆమె ఇద్దరు చిన్నారులు పసి వయస్సులోనే తల్లి ప్రేమకు దూరమయ్యారు. కుమురం భీం జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామానికి చెందిన ధన్నూరి పుష్పలత(25) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే గురువారం గ్రామానికి వచ్చిన ఆర్‌ఎంపీ గుర్లె గణేశ్‌ను బాధిత మహిళ వైద్యం కోసం ఆశ్రయించింది. రక్త నమూనాలు సేకరించిన గణేశ్ రవీంద్రనగర్‌లో పరీక్ష చేయించి టైఫాయిడ్ వచ్చినట్లు తెలిపాడు. గురువారం మధ్యాహ్నం పుష్పలతకు సైలైన్ పెట్టి ఇంజక్షన్(మోనోసెఫ్) ఇచ్చాడు. కొన్ని నిమిషాల్లోనే పుష్పలత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పరిస్థితిని గమనించిన ఆర్‌ఎంపీ అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తంతో వాంతులు కావడంతోపాటు అపస్మారక స్థితికి చేరడంతో భర్త ప్రసాద్, కుటుంబసభ్యులు ఆమెను కౌటాలలోని ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి కాగజ్‌నగర్‌కు తరలించారు. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే పుష్పలత మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యంతోనే పుష్పలత మృతి చెందినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్ గ్రామంలో విచారణ చేపట్టారు. వైద్యానికి వినియోగించిన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎంపీ గణేశ్ పోలీసుల అదుపులో ఉన్నట్లుగా సమాచారం. పుష్పలత మృతదేహం వద్ద భర్తతోపాటు మూడు నెలల కుమార్తె అక్షిత, రెండేళ్ల కుమార్తె శివాని పరిస్థితిని చూసి గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

సేవ్ నేచర్.. సేవ్ ఎర్త్ పేరిట సైకిల్ యాత్ర



చంద్ర బలి మౌర్య

నర్సాపూర్(జి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి పట్టణానికి చెందిన చంద్రబలి మౌర్య సేవ్‌నేచర్.. సేవ్‌ఎర్త్ పేరిట మహారాష్ట్ర వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ యాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. 61వ నంబర్ జాతీయ రహదారిపై నందన్ ఎక్స్ రోడ్డు యాత్రీకుడిని 'సాక్షి' పలకరించింది. నవంబర్ 2021 నుంచి ఇప్పటివరకు 25 వేల కిలోమీటర్లు ప్రయాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. దేశ వ్యాప్తంగా లక్ష కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తిచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. ప్రస్తుత రోజుల్లో మానవులు ప్రకృతి, భూమిని కలుషితం చేస్తున్నారని వాటిని కాపాడుకోవాలని సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు. దాతల సహాయంతో యాత్ర కొనసాగిస్తున్నట్లు వెల్లడించాడు.

తండ్రి కోసం.. తనయుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి జోగు రామన్నను గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడైన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పట్టణంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా తన తండ్రి చేసిన అభివృద్ధిని వివరిస్తూ గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



దహెగాంలో ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

దహెగాం: సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తనయుడు కోనేరు వంశీ ప్రచారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాడల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించాడు. అతడి వెంట మండల రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచు పుప్పాల లక్ష్మి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండ క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీపీ వాణి పాల్గొన్నారు.